ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ ప్రధాన ద్వారం నిర్మాణం వద్ద దాతలు

మేడ్చల్ రూరల్: పూడూర్ గ్రామంలో నిర్మిస్తున్న సాయిబాబా ఆలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన యాటవెల్లి మహిపాల్ రెడ్డి విరాళం అందజేశారు. ఆయన ఆలయ నిర్మాణం ప్రధాన ద్వారం కోసం రూ. 3 లక్షలను నిర్మాణ దారులకు అందజేశారు. గ్రామంలో అందరి కోసం నిర్మిస్తున్న ఆలయం కోసం విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందని అన్నారు.

రైతులకు రుణాల పంపిణీ

శంషాబాద్ రూరల్: మల్కారం ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులకు రుణాలు పంపిణీ చేశారు. రైతులకు సొసైటీ చైర్మన్ బి.సతీష్ చేతుల మీదుగా దీర్ఘకాలిక పంట రుణాల చెక్కులను అందజేశారు. రుణాలను సకాలంలో చెల్లించి సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని చైర్మన్ కోరారు.

నారపల్లిలో తల్లిపాల వారోత్సవాలు



ర్యాలీని ప్రారంభించిన చైర్మన్ కొండల్‌రెడ్డి

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లిలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీని బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చైర్మన్ కొండల్‌రెడ్డి పాల్గొని పిల్లలకు తల్లిపాల ఆవశ్యకతను వివరించి, ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ వేమనరెడ్డి, కౌన్సిలర్ పోచమ్మ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

కీసర: ప్రజల అవసరాలకు అనుగుణంగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఫ్రైడే మార్కెట్ నుంచి దాయరకుంట వరకు సుమారు రూ. 26 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 20 వార్డుల్లో అవసరమైన చోట డ్రైనేజీలు, సీసీ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు, మంచి నీటి పైప్‌లైన్ పనులను చేపడతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేంద్రకుమార్, కౌన్సిలర్లు పంగ హరిబాబు, సుర్వీ శ్రీనివాస్, సుమిత్ర సురేష్, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, డీఈ సుదర్శనం, రఘు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా అశ్వవాహన సేవ



ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని శ్రీ గోదాసమేత శ్రీ మన్నారు రంగ నాయక స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం అశ్వ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి, స్వామివారికి నిత్య నిధి, అశ్వవాహన సేవ జరిగింది. గోదాదేవి జన్మదినం సందర్భంగా తిరునక్షత్రం అభిషేకం నిర్వహించారు. అమ్మవారిని, స్వామివారిని శేషవాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

చేవెళ్ల డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని వినతి

ఘట్‌కేసర్: కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేషన్ ప్రకారం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని మేడ్చల్ రూరల్ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ రజనికి బుధవారం వినతి పత్రం అందజేశారు. అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ. 12 లక్షలు ఇవ్వాలని, ఎస్సీ ఉప కులాలు, మాల, మాదిగ కార్పొరేషన్లకు ఏటా రూ. 750 కోట్లు, దళితుల ఇళ్ల నిర్మాణానికి రూ. 5 లక్షలు, ఎస్సీ హాస్టళ్ల నిర్మాణాలకు నిధులు, సబ్సిడీ రుణాలకు నిధులు కేటాయించాలని లేఖలో కోరారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి మహేందర్, మండల అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు శంకర్, నాయకులు పాల్గొన్నారు.

టాప్రా ధర్నాకు సంఘీభావం

మల్కాజిగిరి: 'టాప్రా' (తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోషియేషన్) ఆధ్వర్యంలో ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు సంఘీభావంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా నాయకులు ర్యాలీ నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వయో వృద్ధులైన పెన్షన్‌దారుల సమస్యలు పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వ తీరు సరికాదని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ధర్నా చేపడుతున్నామని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు పలకాలన్నారు. నాయుడు, రామేశ్వరరావు, తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

శామీర్‌పేట్: ఓ కేసు విషయమై న్యాయస్థానంలో హాజరు కావాల్సి ఉందనే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ... శామీర్‌పేట మండలం అలియాబాద్ గ్రామానికి చెందిన మహేష్(38) ట్రాక్టర్ డ్రైవర్‌గా చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా రెండేళ్ల క్రితం తన భార్య మృతి చెందగా భర్త మహేష్‌పై కేసు నమోదైంది. ఆ కేసులో బుధవారం న్యాయస్థానంలో హాజరు కావాల్సి ఉండగా మనస్తాపం చెంది గ్రామ పరిధిలోని మోట బావి వద్ద ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్యానికి చేరువలో..

వనమహోత్సవం

'స్వచ్ఛదనం-పచ్చదనం'తో లక్ష్య సాధన దిశగా...

- గ్రామాల్లో ఊపందుకున్న మొక్కలు నాటే కార్యక్రమం
- పురపాలికలు, ప్రభుత్వ శాఖల్లో వనమహోత్సవంపై నిర్లక్ష్యం



గ్రామ పంచాయతీల్లో మొక్కలు నాటుతున్న ప్రజలు, సిబ్బంది

మేడ్చల్ జిల్లా టార్గెట్ 63.70 లక్షలు
ఇప్పటి వరకు నాటింది 78.44 %
గ్రామాల్లో మాత్రం 7.76 %

సాక్షి, సిటీబ్యూరో: పచ్చదనాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'వనమహోత్సవం' కార్యక్రమం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో లక్ష్యానికి చేరువలో ఉంది. జిల్లా యంత్రాంగం నిర్దేశించిన లక్ష్యాన్ని సకాలంలో పూర్తి చేసేలా 'స్వచ్ఛదనం-పచ్చదనం' కార్యక్రమంలో విస్తృతంగా మొక్కలు నాటడంపైనే కార్యాచరణ ప్రణాళికను రూపొందించి ఆ ముందుకు సాగుతోంది. పండుగలా వనమహోత్సవం కార్యక్రమం కొనసాగేలా ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను భాగస్వాములను చేయాలన్న కలెక్టర్ ఆదేశాల అమల్లో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు ప్రత్యేక దృష్టితో చర్యలు తీసుకుంటున్నాయి.

క్షేత్ర స్థాయి పరిస్థితులు ఇలా..

ప్రకృతి సమతుల్యత పర్యావరణ పరిరక్షణతోనే సాధ్యపడుతోంది. సమృద్ధిగా వర్షాలు కురవాలంటే సాధారణంగా అటవీ విస్తీర్ణం కనీసం 33 శాతం ఉండాలని అటవీ శాఖ పేర్కొంటున్నా జిల్లాలో మాత్రం పరిస్థితి విరుద్ధంగా ఉంది. ఈ లోటును అధిగమించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా వ్యాప్తంగా 63.70 లక్షల మొక్కలను నాటాలని టార్గెట్‌గా పెట్టుకుంది.

- జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థతోపాటు వివిధ ప్రభుత్వ శాఖలకు మొక్కలు నాటే లక్ష్యాలను అధికార యంత్రాంగం ఖరారు చేయగా ఇప్పటి వరకు 49.96 లక్షలు (78.44 శాతం) మొక్కలను నాటారు.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో పలు పురపాలక సంఘాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలు వనమహోత్సవంపై నిర్లక్ష్యం చూపుతున్నట్లు తెలుస్తోంది. పురపాలికల్లో అవిశ్వాస తీర్మానాలపై చూపుతున్న శ్రద్ధ వనమహోత్సవంపై చూపటం లేదనే విమర్శలు ఉన్నాయి.
- జిల్లాలో రెవెన్యూ, పరిశ్రమలు, పోలీసు, ఎక్సైజ్, పంచాయతీరాజ్ (ఇంజినీరింగ్), ఆర్ అండ్ బీ, విద్యా శాఖ, నీటిపారుదల, పశు సంవర్థక, వ్యవసాయ, ఉద్యాన శాఖ, శిశు, మహిళా, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖలు మాత్రం ఆడపాదడపా మాత్రమే భాగస్వామ్యం అవుతున్నాయి.ఈ నేపథ్యంలో పురపాలిక సంఘాలు, ప్రభుత్వ శాఖల్లో వనమహోత్సవం విజయవంతంగా కొనసాగాలంటే కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాల్సి అవసరముందని పేర్కొంటున్నారు.
- రూరల్ ప్రాంతంలో వనమహోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.
- వనమహోత్సవంలో గ్రామీణాభివృద్ధి, పంచాయతీ, అటవీ శాఖలు మాత్రమే కీలక ప్రాత పోషిస్తున్నాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 61 గ్రామ పంచాయతీల పరిధిలో వనమహోత్సం లక్ష్యం 12 లక్షలు కాగా, ఇప్పటివరకు 97.76 శాతం మొక్కలు నాటారు. ఘట్‌కేసర్ మండలంలోని 11 గ్రామాల్లో 96.99 శాతం మొక్కలు నాటగా, కీసర మండలంలోని 10 గ్రామాల్లో 97.03 శాతం, మేడ్చల్ మండలంలోని 17 గ్రామాల్లో 96.38 శాతం, ఎంసీపల్లి మండలంలోని 13 గ్రామాల్లో 98.65 శాతం, శామీర్‌పేట మండలంలోని 10 గ్రామ పంచాయతీల్లో 97.76 శాతం మొక్కలు నాటినట్లు రికార్డులు చెబుతున్నాయి. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలు మొక్కలు నాటేందుకు అనుకూల వాతావరణం ఏర్పడటంతో రహదారుల పక్కన, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాలు, చెరువు గట్లు, ప్రైవేటు రంగ సంస్థల కార్యాలయాల్లో వెంచర్లు, లే అవుట్లు, ప్రభుత్వ స్థలాలు, శ్మశాన వాటికల్లో మొక్కలను విరివిగా నాటాల్సి ఉంది. ఈ నెలాఖరు కల్లా వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేసేందుకు అధికార యంత్రాంగం పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతోంది.

కొనసాగుతున్న 'స్వచ్ఛదనం-పచ్చదనం'



మేడ్చల్ ఐటీఐ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఏడీఎంఏ జాన్ శాంసన్

మేడ్చల్: గ్రామాలు, వార్డుల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం కొనసాగుతోంది. అందులో భాగంగా బుధవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలలోని అన్ని వార్డులు, మండలంలోని అన్ని గ్రామాలలో కార్యక్రమాలను నిర్వహించారు. కార్యాలయల వద్ద ఇతర ప్రాంతాలలో నిల్వ ఉన్న వర్షం నీటిని తొలగించారు. గుంతలయంగా ఉన్న రోడ్లపై వెట్ మిక్స్‌లు వేసి మరమ్మతులు చేయించారు. గుండ్లపోచంపల్లి ఆరో వార్డు, మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేశారు. గుండ్లపోచంపల్లి మేడ్చల్‌లో ఏడీఎంఏ జాన్ శాంసన్ పర్యటించారు. అధికారులు, కౌన్సిలర్లతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో చైర్మన్‌లు లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, దీపిక నర్సింహారెడ్డి కమిషనర్లు నాగిరెడ్డి, స్వామి, వైస్ చైర్మన్లు రమేష్, ప్రభాకర్, కౌన్సిలర్లు ఉమానాగరాజు, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లొచ్చేలోగా ఇంట్లో చోరీ

కీసర: ఊరికి వెళ్లి వచ్చేలోగా ఇంటిలో చోరీకి పాల్పడ్డారు. మంగళవారం రాత్రి చీర్యాలలోని ఎస్ఎల్ఎన్ కాలనీలో చోటుచేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య సమాచారం మేరకు... ఎస్ఎల్ఎన్ కాలనీలో ఉండే ప్రసాద్‌రాజ్ కుటుంబం రెండు రోజుల క్రితం ఇంటికి తాళం చేసి ఊరికి వెళ్లారు. బుధవారం ఊరి నుంచి వచ్చి చూసేలోగా ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించిన ప్రసాద్‌రాజ్ వెంటనే స్థానికుల సహాయంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దుండగలు ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి వెళ్లి బీరువాలో దాచిన రెండు తులాల బంగారు ఆభరణాలతోపాటు కొంత నగదు ఎత్తుకెళ్లారు. దీంతోపాటు పక్కనే ఉన్న కిరాణ దుకాణంలో రూ. 11 వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

దాడి కేసులో నిందితుల రిమాండ్

ఘట్‌కేసర్: అకారణంగా యువకుడిపై దాడి చేసిన ముగ్గురిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రెడ్డి సమాచారం మేరకు... పట్టణానికి చెందిన నీలం కిరణ్, అతడి బావ రాజును వారి ఇంటిలోకి జూలై 31న అక్రమంగా ముగ్గురు ప్రవేశించి దాడి చేశారు. బలమైన గాయాలైన ఇరువురు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితులు గాంధీనగర్‌కు చెందిన హేల ఉదయ్‌కిషన్, గాలికర్ సచిన్, హేల జైకిషన్‌ను రిమండ్‌కు తరలించారు.

అత్యవసర పనులకు సత్వర పరిష్కారం



కార్యక్రమంలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్ : నగర పాలక సంస్థలో అత్యవసర పనులను గుర్తించి వాటికి సత్వర పరిష్కారం చూపుతామని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 3, 14 డివిజన్‌లలో బుధవారం నిర్వహించిన స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన జీవితం కోసం స్వచ్ఛదనంతో పాటు పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం 11వ డివజన్ పరిధిలోని తిరుమల మెడోస్ కాలనీలోని గుంతలను పూడ్చివేశారు. కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు కొత్త చందర్‌గౌడ్, కుంభం కిరణ్‌కుమార్‌రెడ్డి కాలనీ వాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో వేసిన రోడ్డు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



రోడ్డును తొలగిస్తున్న దృశ్యం

మేడ్చల్: ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి వెంచర్ కోసం వేసిన సీసీ రోడ్డును రెవెన్యూ అధికారులు తొలగించారు. రెవెన్యూ అధికారులు జేసీబీ సాయంతో రోడ్డును ధ్వంసం చేశారు. పట్టణంలోని కిష్టాపూర్ రోడ్డులో రియల్టర్లు గతంలో వెంచర్ ఏర్పాటు చేసి రోడ్డు కోసం సర్వె నంబర్ 145లో ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసి ఏకంగా సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ అంశాన్ని 'ప్రభుత్వ స్థలంలో సీసీ రోడ్డు నిర్మాణం' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో మంగళవారం కథనం ప్రచురితమైంది. 'సాక్షి' కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో నిర్మించిన సీసీ రోడ్డును తొలగించారు. ప్రభుత్వ స్థలాల్లో కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ శైలజ హెచ్చరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి



నాగారంలో స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని ప్రతి వార్డులో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మున్సిపల్ పరిధిలోని 17, 5, 6, 9 వార్డుల్లో ఇంకుడు గుంతల నిర్మాణం, పాత్‌హోల్స్ పూరించడం, నీరు నిలిచి ఉండే ప్రాంతాలను క్లీనింగ్ చేయడం, మురుగు నాలా, స్ట్రాం వాటర్ డ్రైన్‌లను క్లీనింగ్‌తోపాటు, ప్రభుత్వ పాఠశాలలను, పబ్లిక్ హెల్త్ సెంటర్లను క్లీనింగ్ పనులను మున్సిపల్ సిబ్బందితో చేయించారు.

- దమ్మాయిగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేయడం, మురికి కాలువలను శుభ్రపరచే కార్యక్రమాలను మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణితాగౌడ్, కమిషనర్ నాగమణి, పర్యవేక్షించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపడుతున్న పనులను కాలనీవాసులకు వివరించారు.
- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కీసర మండలం చీర్యాల గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి పూర్ణిమ, ఎంపీడీఓ గ్యామ పాల్గొన్నారు. జిల్లా గ్రౌండ్ వాటర్ ఆఫీసర్, (స్పెషల్ అధికారి) రేవతి, మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు కౌకుట్ల అనంతరెడ్డి, లావణ్య శ్రీనివాస్, అనితాసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌ను ప్రగతిబాట పట్టిస్తాం

- కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్



మల్లికార్జుననగర్‌లో డ్రైనేజీ సమస్యలు పరిశీలిస్తున్న వజ్రేష్‌యాదవ్, పరమేశ్వర్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని మల్లికార్జుననగర్-వంపుగూడ ప్రాంతంలోని డ్రైనేజీ ఔట్‌లెట్ సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారనే సమాచారంతో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డిలు అధికారులతో కలిసి మురుగు కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ... జవహర్‌నగర్ కార్పొరేషన్ సమస్యల వలయంలో ఉందన్నారు. జవహర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేద్దామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు కేటాయించేలా కృషి చేసి, జవహర్‌నగర్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. మల్లికార్జుననగర్‌లో డ్రైనేజీ సమస్య ఎన్నో సంవత్సరాల నుంచి ఉందని, మేడ్చల్, ఉప్పల్ నియోజకవర్గాల మధ్య ఔట్‌లెట్ సమస్యలతో ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారన్నారు. జవహర్‌నగర్‌లో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేద్దామన్నారు. కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి, మేయర్ శాంతి, డిప్యూటీ మే యర్ శ్రీనివాస్, కార్పొరేటర్లు రవి, ఆశాకుమారి, సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, నాయకులు యాదగిరియాదవ్, వినయ్‌కుమార్, శ్రీనివాస్, వెంకటేష్‌గౌడ్, వెంకన్న, మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన వినయ్

ఘట్‌కేసర్: కళాశాల నుంచి ఇంటికి వెళ్లడానికి బయలుదేరిన ఓ విద్యార్థి అదృశ్యమయ్యాడు. ఘట్‌కేసర్ సబ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ సమాచారం మేరకు.. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన దామర వినయ్(16) ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల్ ఉప్పల్ జూనియర్ కళాశాలలో జులై 6న ఎంఎల్‌టీ మొదటి సంవత్సరంలో చేరాడు. వినయ్ చదువుపై ఆసక్తి లేకపోవడంతో మంగళవారం సాయంత్రం సమాచారం ఇవ్వకుండా కళాశాల నుంచి వెళ్లిపోయాడు. ఈ విషయం కళాశాల సిబ్బంది వారి తల్లితండ్రులకు సమాచారమివ్వగా ఇంటికి చేరుకోలేదని తెలిపారు. వినయ్ గత నెల 19న ఎవరికి చెప్పకుండా కళాశాల నుంచి వెళ్లిపోయి అదే రోజు ఇంటికి చేరుకున్నాడు. అనంతరం వినయ్ తల్లితండ్రులు అతడిని ఈ నెల 5న తిరిగి కళాశాలో చేర్పించారు. వినయ్ అదృశ్యంపై ప్రిన్సిపల్ వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నేమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునామన్నారు.

చోరీ కేసులో నిందితుడి రిమాండ్

ఘట్‌కేసర్: పట్టణంలోని ఓ ఇంటిలో జరిగిన చోరీ కేసులో నిందితుడిని ఘట్‌కేసర్ పోలీసులు బుధవారం రిమాండ్‌కు తరలించారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వివరాల మేరకు... గాంధీనగర్‌కు చెందిన మహమ్మద్ అక్రమ్ జులై 31న రాత్రి ఇంటికి తాళం వేసి నగరంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఆగస్టు 2న తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటం, బీరువాలో ఉండాల్సిన రెండు వెండి జతల పట్టగొలుసులు, ఒక జత వెండి కాళ్ల కడియాలు, కొంత నగదు కనిపించకపోవడంతో పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విశ్వసనీయ సమాచారంతో మైసమ్మగుట్ట సర్వీస్ రోడ్డులో అనుమానాస్పదంగా కనిపించిన సంగారెడ్డిలో నివసించే కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేటకు చెందిన తెనుగు మహేందర్(22)ను అదుపులోకి తీసుకొని విచారించగా బాలాజీనగర్‌లో అక్రమ్ ఇంటలో చోరీ చేసినట్టు, తనతో పాటు హైదరాబాద్ రసూల్‌పూర్‌కు చెందిన సోను ఉన్నట్లు తెలిపాడు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని చోరీ వస్తువలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. మరొక నిందితు డు పరారీలో ఉన్నాడని డీఐ వెల్లడించారు.

17 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

మేడ్చల్: అనుమతి లేకుండా రవాణా చేస్తున్న ప్రజా పంపిణీ బియ్యాన్ని మేడ్చల్ పోలీసులు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ సమీపంలో బుధవారం పట్టుకున్నారు. పోలీసుల వివరాల మేరకు... నగరంలోని ఎల్బీనగర్‌లో ఫయాజ్ అనే వ్యక్తి 17 టన్నుల రేషన్ బియ్యాన్ని కేపీ38-8077 లారీలో నింపాడు. డ్రైవర్ రాజశేఖర్(42)కు ఆ బియ్యాన్ని మహారాష్ట్రకు తీసుకెళ్లాలని సూచించారు. విశ్వసనీయ సమాచారం మేరకు కండ్లకోయ వద్ద తనిఖీలు చేపట్టగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. రాజశేఖర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా ఫయజ్ మహారాష్ట్రకు బియ్యాన్ని పంపిస్తుండగా అక్కడ రత్నాకర్ అనే వ్యక్తి కొనుగోలు చేస్తున్నట్లు తేలింది. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బియ్యాన్ని పీఎస్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువును పరిరక్షిద్దాం



సఫిల్‌గూడ లేక్‌పార్కు వద్ద మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మల్కాజిగిరి: సఫిల్‌గూడ చెరువును పరిరక్షించుకుందామని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సఫిల్‌గూడ చెరువు వద్ద మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. మినీ ట్యాంక్‌బండ్‌గా ఉన్న సఫిల్‌గూడ చెరువును పరిరక్షించుకోవడానికి అందరూ ముందుకు రావాలన్నారు. డీసీ రాజు, ఎస్ఎస్ నాగరాజు, ఏఈ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

- ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్ కాలనీలో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ రాజు పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. కాలనీవాసులకు చెత్త సేకరణకు వచ్చే వారికి సహకరించాలని కోరారు.